# ఎవరికి వారే

(తెర ఎత్తగానే వీధిలో మునిసిపాలిటీ కొళాయిదగ్గర తెల్లటి సైనుపంచ ముసుగు వేసుకుని శ్లోకాలు వల్లించుకుంటూ స్నానం చేస్తున్న సుబ్బమ్మ, చుట్టూ బిందెలతో సరస్వతమ్మ, పార్వతమ్మ, నరసమ్మ, రావమ్మ, లక్ష్మమ్మ, సుశీల కన్పిస్తారు.)

సరస్వతమ్మ: ఏం సుబ్బమ్మగారూ, వేగం కానీయండి స్నానం! - మీరొక్కరే ఇంతసేపు కొళాయి పట్టుకొని కూచుంటే మిగిలినవాళ్ళు ఎంతసేపు ఇలా నిల్చుంటారనుకున్నారు?

సుబ్బమ్మ: ఏవం సతత యుక్తాయే... భక్తాస్త్వాం... పర్యుపాసతే ... ఎలాగమ్మ మరి! - చెయ్యనిస్తావా లేదా?

నరసమ్మ: చెయ్యనివ్వకపోవడంలేదు - కొళాయి తెరవగానే ఆరంభించారు స్నానం - గంట కావస్తోంది ఇంకా లేవకపోతే ఎలాగండీ?

సుబ్బ: గంటసేపెక్కడయిందే?... శ్రద్ధయా పరయోపేతా స్తేమే యుక్తతమా మతాః...

పార్వతమ్మ: గంటేమిటి? - గంటకిపైనే అయింది మీగా స్నానం ఆరంభించి - ఈసరికైనా తెమలకపోతే ఎలాగ?

సుబ్బ: ఏకు సర్వాణి కర్మాణి... మై సన్యస్య మత్పరా... ఏమిటమ్మా, పూర్తిగా స్నానం చేయనివ్వరేమిటి?

లక్ష్మమ్మ: లేవండి మరి వేగంగా! - రోజల్లా మీరే కూచుంటే అవతల మాకేం పనుల్లేవా ఏమిటండీ ఇక్కడ గంటలకొద్దీ నీళ్ళకోసం కూచోడానికి?

సుబ్బ: (కోపంతో) ఏమిటమ్మా మీ తొందర? - మునిసిపాలిటీవాళ్ళు కట్టించిన కొళాయిదగ్గర స్నానం చేస్తుంటే మీ అడ్డేమిటి మధ్యని?... పాపమహాం సముద్ధర్తా...

సుశీల: మునిసిపాలిటీవాళ్ళు కట్టించింది కనకనే అందరికీ అధికారంవుంది అమ్మమ్మగారూ! - ఇది అందరికోసం కట్టించారు.. ఈ సంగతి మరచి కొళాయి తెరిచింది మొదలు మీ రొక్కరే పట్టుకూర్చుంటే మాకు మరి నీళ్ళక్కర్లేదా చెప్పండి!

సుబ్బ: (కోపంతో) అయ్యో, అక్కర్లేదన్లేదే తల్లీ!... లేచిపోతానే మా అమ్మ!..

సుశీ: వేగంగా స్నానం చేయమంటే అంతకోపం దేనికండీ?

సుబ్బ: కోపం పడలేదే అమ్మా!... మీతో మేం కాలగలంటే తల్లీ?.. ఓ రెండుచెంబులు నెత్తిమీద పోసుకుపోయే దానికే ఇంతలా దెబ్బలాడేవాళ్ళని నే నెక్కడా చూళ్ళేదే తల్లీ!

లక్ష్మ: ఇప్పుడు మీతో ఎవరు దెబ్బలాడేరు పిన్నిగారూ! - అవతల చాలా పనులున్నాయి; వేగం స్నానం చేయండమ్మ అంటే దెబ్బలాటా?

సుబ్బ: (కోపంతో) మరి స్నానంచేయకపోతే ఆడుతున్నానా యేమిట్రా? — అంత తొందరైతే ఎలాగ? - స్నానం పూర్తి కానిస్తారా లేదా?

సుశీ: (నవ్వుతూ) ఇది కూడా ఓ రకమైన ఆటేనండీ! - దీనినే జలక్రీడ అంటారు.

సుబ్బ: (పట్టరాని కోపంతో) ఏమిటే ఆ రాలుపాటు? - పెద్దా చిన్నా లేకుండా నోటి కెంతొస్తే అంతేనా? - నే నిక్కడ ఆడుకుంటూ కూచున్నానా?... క్లేశాధిక తర స్తేషా...

## శ్రీ పంతుల కృష్ణారావు

సుశీ: అయితే మరి వేగం కానీయండి స్నానం?

సుబ్బ: మరి చేస్తున్నానా లేదా?... మవ్యాక్తాసక్త చేతసాం...

సుశీ: ఎంతసేపు చేయడం? - మీపారాయణ పూర్తయేదాకా సహస్రఘటాభిషేకం చేసుకుందా మంటే వీధికొళాయి దగ్గర వీలుంటుందా?

సుబ్బ: అయ్యో, ఇదేం పాడు బుద్ధే? - నేను శ్లోకాలు వల్లించుకుంటే నీకేంబాధే మధ్యని?

సర: అయితే ఇంటికి పోయి వల్లించుకోండి! - ఇక్కడ కూచొని ఏనాటికీ లేవకపోతే మా పను లేం గావాలి?

సుబ్బ: అయ్యో, లేచిపోతానే నా అమ్మ! - ఈ కాలపు వాళ్ళతో మేం చాల గలంటే తల్లీ? - పాడుకాలం వచ్చింది. ఓ దేవుడంటే భక్తా? - పెద్దలంటే గౌరవమా? - మరీ భూమిమ్మీదా ఆకాశంమీదా వుండరు!

(ఇంతలో ముసుగు సవరించుకుంటూ వెంకమ్మ బిందె పట్టుకొని వస్తుంది.)

వెంకమ్మ: ఎవరమ్మ అక్కడ స్నానం చేస్తోంది? - సుబ్బమ్మగారా?... సుబ్బమ్మగారూ, మా అమ్మ మా అమ్మ! - వేగం లెద్దురూ! - అవతల మా నాడు ఇప్పుడు 'మేలు'లో రాజమండ్రీ వెళ్ళాలి. వేగం వంట చేయమన్నాడు. త్వరగా వండి పెట్టాలి! - ఎసరు పెడదామంటే ఇంట్లో నీళ్లు లేవు... మా తల్లీ, ఓ రెండు చెంబులతో ఒళ్లు తడుపుకొని బిందెడు నీళ్లు పట్టుకుపోతాను.

పార్వ: ఏమండోయ్ వెంకమ్మగారూ! మీకంటే అర్జంటు నాకు! - ఇంట్లో ఆరేళ్ల చిన్నకుంటని వుంచి వచ్చాను గంట కిందట, నీళ్ళకోసం. ఈసరికేనా వెళ్లకపోతే ఇంట్లో కుక్క దూరుతుందో, పిల్లే దూరుతుందో? - సుబ్బమ్మగారి తర్వాత నేను పట్టుకోవాలి నీళ్ళు!

సర: మీకంటే అత్యవసరమండీ నాకు, పొయ్యిమీద బియ్యం పడేసివచ్చాను. అది మాడిపోతే మరి బియ్యం కూడా లేవు.

నర: నాకు మరీ అర్జంటు పనులున్నాయండీ! - అవతల చంటిపి ల్లేడుస్తుంది.

లక్ష్మ: ఆయనకి ఆఫీసు టైమైపోతోంది. వడ్డిద్దామంటే ఔపోసన క్కూడా నీళ్లు లేవింట్లో.

వెంక: మీ అందరిపనులూ తర్వాత చేసుకోవచ్చునమ్మ - సుబ్బమ్మగారి తర్వాత నన్ను తీసుకోనివ్వండి! - అవతలవాడికి మేలువేళకి వండిపెట్టాలి!

సర: మీరు కొంచెం ఆగాలి వెంకమ్మగారూ! - పొయ్యిమీద బియ్యం......

పార్వ: ముందు నేను తీసుకోవాలి సరస్వతమ్మగారూ! - ఇంట్లో చిన్నకుంటని...

నర: అవతల పిల్లేడుస్తోందండీ!

రావ: ఇప్పుడు నే నర్జంటుగా ఓబిందెడు తీసుకెళ్ళకపోతే పిల్లేదమ్మ - కొళాయి కట్టేశారంటే చచ్చేనన్నమాట! - ఇంట్లో పురిశెడు నీళ్ళు లేవు.

వంక: మొదట నేనో రెండు చెంబులు పోసుకొని ఓ బిందెడు పట్టుకుపోతాను. తర్వాత మీరందరూ తీసుకుందురుగాని!

సర: వీల్లేదండీ, సుబ్బమ్మగారి తర్వాత నేను తీసుకుంటాను.

పార్వ: నేను పట్టుకుంటాను సుబ్బమ్మగారి తర్వాత!

సుబ్బ: అబ్బ! ఏమిటే దెబ్బలాట? - దూరంగా వుండండి నే వెళ్ళిపోతాను! - తర్వాత మీరు దెబ్బలాడుకుందురుగాని!...



...ంబరధరం విష్ణుం... అయ్యో, దారివ్వరే ..., ముట్టేసుకుంటారేవిటి?

...ంక: ముట్టేసుకోలేదు ... ఇలా వెళ్ళండి సుబ్బమ్మగారూ!

సుబ్బ: దారివ్వండి మరి!...శశివర్ణం - చతుర్భుజం... ప్రసన్నవదనం... (వెళ్ళిపోతుంది. అందరూ ఒక్కసారిగా వెళ్ళి కొళాయిమీద పడతారు. అందరికంటే ముందు వెంకమ్మగారు వెళ్లి కొళాయిక్రింద బిందె పెడుతుంది. కాని నీటిని పడనివ్వకుండా మిగిలినవారంతా గట్టిగా కొళాయి మర పట్టుకుంటారు.)

వెంక: ఒదలండమ్మా మర! - అలా పట్టుకూర్చుంటే నీరెలా పడుతుంది?

సర: వీల్లేదు వెంకమ్మగారూ, మొదట నే నిన్ని నీళ్ళు పట్టుకుపోవాలి. మీ బిందె తీయండి!

లక్ష్మి: ఏమండోయ్, నేను మొదట.

పార్వ: నేను మొదట పట్టుకోవాలండీ.

వెంక: మీరంతా నేను వెళిపోయాక పట్టుకుందురు గాని! - అవతల వాడికి మేలు వేళకి వండిపెట్టాలి! - ఓ రెండు చెంబులు బుర్రమీద పోసుకొని ఓ బిందెడు నీళ్ళు పట్టుకుపోతాను.

సర: వీల్లేదండీ!

పార్వ: ఏవండోయ్, మా అమ్మ! - నన్ను తీసుకో నివ్వండి మొదట!

లక్ష్మి: ఏవమ్మోయ్, మీరందరూ కొంచెం సేపు నిల్చోవాలి! - అవతల ఆయనకి ఆఫీసు....

సర: నన్ను మొదట తీసుకోనివ్వండమ్మా! - అవతల వంటిది...

రావ: ఇంట్లో ఓ చుక్కైనా నీళ్లు లేవు. ఏ పనీ కాలేదు.

సుశీల: బాగుందండీ, ఇంతమందికీ ఒక్కమారే అర్జంటయితే ఎలాగ? - ఎవరో ఒకరు తీసుకోవాలి గాని!

వెంక: అదే చూశావా, వాడికి మేలు వైముకి...

సర: నాకూ అంతకంటే అర్జంటు పనులున్నాయ్.

పార్వ: నాకు మరీ అర్జంటు పనులున్నాయ్.

లక్ష్మి: నాకు ప్రాణావసరమైన పనులున్నాయి.

సర: నాకు పీకలమీద పనులున్నాయి.

సుశీ: అయితే, ఒకరికి కాకుండా ఒకరు దెబ్బలాడుకుంటూ కూచుంటే నీళ్లు తీసుకొని వెళ్లడం అవుతుందటండీ - ఇప్పటికే ఎవరూ నీరు తీసుకోకుండా అరగంట పైన గడచిపోయింది. మళ్ళీ తొమ్మిదిన్నరకి కొళాయి కట్టేస్తారు... అంచేత ఎవరో ఒకరిని మొదట పట్టుకొని పోనివ్వండి!... ఒకరి తర్వాత ఒకరు వరసగా తీసుకుంటే అందరం వేగంగా నీళ్లు పట్టుకొనిపోవచ్చు.

సర: చాల్లేవే మా చెప్పొచ్చావ్! — పొద్దల్లా నీలాగ కొళాయిదగ్గర ముస్తాబై నిలుచోడానికి మాకేం పనులు లేవనుకుంటున్నా వేంటి?

పార్వ: నీకయితే ఇంటిపూచీ ఏంవీ అక్కర్లేదు.

సర: ఇంటి చాకిరీ అంతా ఆ ముసలిది చేస్తోంది కనక టింగురంగా అని ముస్తాబై నిల ...టావు.

సుశీ: నాకేం పనిలేక నిల్చోలేదండీ ఇక్కడ! - అర్జంటు పనులున్నాయని అందరం దెబ్బలాడుకుంటూంటే ఎవరి పనీ కాదని చెబుతున్నాను.

లక్ష్మి: నువ్వు మాకే మీ చెప్పక్కర్లేదులే! - నీపాటి మాకూ తెలుసు!... ఊఁ! బిందె తియ్యండి వెంకమ్మగారూ - వేగం

వెంక: వీల్లేదమ్మా!...

సర: ఏమైనా మొదట మీరు పట్టుకోడానికి వీల్లేదు వెంకమ్మగారూ! - మీరు లేవాలి!

వెంక: ఏవిఁటమ్మా నీ అధికారం? - మీ తాతగారు కట్టించినట్టు మాట్లాడుతున్నావ్

సర: మీ అధికారం ఏవిఁటి? - మీ బాబుగారు కట్టించినట్టు సాధిస్తున్నారు.

రావ: మునిసిపాలిటీవాళ్లు కట్టిం[illegible]

వెంక: అహాఁ - అయితే మరి నీళ్లు పట్టుకోవద్దనడానికి మీ అధికారం ఏవిఁటి?

సర: మా అందరికంటే మీరు వెనక వొచ్చారు...

(ఇంతలో వెంకమ్మగారి కొడుకు ప్రకాశం వస్తాడు.)

ప్రకా: ఏమే అమ్మా, ఇంకా కొళాయి దగ్గర కూచున్నావేం? - స్టేషనుకి బయల్దేరే వేళవుతోంది - వేగంగా వచ్చి నాకు వడ్డించీ! అర్జంటుగా పోవాలి!

వెంక: (ఆశ్చర్యంతోను, విచారంతోను) అప్పుడే వేళయిందిరా?

ప్రకా: అప్పుడే ఏవిటి? ఇప్పుడే ఎనిమిదిన్నరయింది!

వెంక: (విచారంతో) అయ్యో నా మొహంమండా! - ఈ దిక్కుమాలిన కొళాయి

## ★ ఎవరికి వారే ★

దగ్గర నీళ్ళకోసం వుండిపోయా[న]నా నాయనా! - ఇంట్లో పురిశెడు నీళ్ళు లేవని వచ్చాను కాని ఇలా జౌతుందనుకోలేదురా బాబూ! - (కోపంతో) అయినా పరమ ధండాలపు ముండావూరు ఇదేతప్ప మరోటి లేదు! - ప్రాణావసరమైన పను లున్నాయమ్మా అని ప్రార్థించినా ఓ పిసరు మొహమాటం వుంచి ఆలోచించరు!

ప్రకా: పోనీ, మరేం ఫరవాలేదు స్టేషను దగ్గర హోటల్లో భోంచేస్తాన్లే! - నే వెళిపోతాను ఇంటికి రా!

వంక: అయ్యో, ఏం బాధొచ్చిందిరా! ఇల్లూ వాకిలి వుంటూండగా పాడు హోటేలు భోజనం చేయవలసొచ్చిందిరా తండ్రీ! - ఈ వల్లకాటి నీళ్లకోసం పని మానుకు నిల్చున్నా[న]నా (కోపంతో సరస్వతమ్మ మొదలగువారితో) అయిందమ్మా మీ దెబ్బలాట? - ఓ బిందెడు నీళ్ళు పట్టుకుంటానంటే వీల్లేదని బంకెక్కలాగేరు - ఇంక నా కక్కర్లేదు - మీరే నెత్తిమీద పెట్టుకోండి నే పోతున్నాను (వెళిపోతుంది).

సర: (వెంకమ్మ వెళిపోయినవంక చూస్తూ) ఎవరిమీదనో ఆ కోపం? - అందరికంటే ఆఖరునొచ్చి నేను ముందంటే ఎవరొప్పుకుంటారనుకుందో?

పార్వ: అదే; ఎవరిమీదనో అలక! -

లక్ష్మ: వల్లకాటి నీళ్ళట! - మరి ఆ నీళ్లకోసమే...

సర: పోనీ, శని విరగడైంది! - హమ్మయ్య - పొద్దుటనగా ఒస్తే ఇప్పుడు చోటు దొరికింది - (కొళాయి క్రింద బిందె పడుతుంది)

పార్వ: ఏమండోయ్ సరస్వతమ్మగారూ! - మా తల్లీ! - మొదట నన్ను తీసుకోనివ్వండి - అవతల ఇంట్లో ఎవరూ (సరస్వతమ్మ పెట్టిన బిందెను తీయబోతుంది.)

సర: (పార్వతమ్మను అడ్డగిస్తూ) వీల్లేదమ్మా! - పొయ్యిమీద బియ్యం...

సర: మొదట నేనో బిందెడు పట్టుకోనిదీ మరెవ్వరినీ పట్టుకోనియ్యనమ్మా! (కొళాయి మర తిప్పుతుంది.)

పార్వ: (కోపంతో) పట్టుకోవద్దనడానికీ పట్టుకోనీయక పోవడానికి మీ రెవరమ్మా? - (నీరు పడకుండా కొళాయి మర త్రిప్పి పట్టుకుంటుంది.)

సుశీ: ఎవరూ ముందుకాకుండా ఎలా అవుతుందండీ?...

పార్వ: అందరికంటే అవిజే ముందు కావాలంటే ఎలా వీలవుతుందే! - అందరికీ అంత అర్జంటే వుంటుంది!

సుశీ: (విసువుగా) బావుందండీ! — అంతా అర్జంటని దెబ్బలాడుకుంటూంటే ఎప్పటికి తగువు తీరుతుంది? ఇప్పటికే గంటాయ దెబ్బలాటవుతోంది - ఎవరో కొందరు తగ్గి వెనక్కి వుంటే - ఒకరి తర్వాత ఒకరు తీసుకొని వేగం పోవచ్చు.

అందరూ ఒక్కసారిగా: వెనక్కుండడానికి మాకు తీరుబాటు లేదు.

(ఇంతలో గొల్ల గుంపమ్మ, ఆమె కోడలు చెరో నాలుగేసి బిందెలు పట్టుకొని వస్తారు.)

గుంప: తెగండమ్మా వేగి! - అవతల గేదెల కుడితిలోకి నీళు లేవు - పోవాలి!


కేసరి రత్నత్రయము

లోధ్ర

గర్భాశయ రోగ నివారిణి

స్త్రీల వ్యాధులన్నింటికి, హిష్టిరియా. కీళ్ల నొప్పులు, నిద్రలేకపోవడం. అజీర్ణం. మలబద్ధకం, దగ్గు, ఉబ్బసం, తలనొప్పి, నడుంనొప్పి మున్నగువాటికి శ్రీరామరక్ష.

అమృత

రక్తాన్ని పరిశుభ్ర పరచగల దివ్యౌషధం

పాండువ్యాధి, అజీర్తి మలబద్ధకం బ్రెయిన్-ఫాగ్. అశక్తత, జ్ఞాపకశక్తి విహీనత, మందబుద్ధి, చర్మరోగాలను ఇట్టే కుదురుస్తుంది.

ఆర్కు

జ్వర రోగ నివారిణి

ఇన్ఫ్లూయెంజా. టైఫాయిడ్, మలేరియా మున్నగు అన్నిరకముల జ్వరములకు దివ్యౌషధం. స్ప్లీన్ లివర్ వ్యాధులకు కూడా శ్రీరామరక్ష.

కేటలాగు కొరకు వ్రాయండి.

కేసరి కుటీరం లిమిటెడ్

రాయపేట : మద్రాసు-14.

ఒరిస్సా, నైజాము. ఆంధ్ర. తమిళ జిల్లాలకు ఏజంట్లు

శ్రీ సీతారామ జనరల్ స్టోర్సు

బరంపురం. సికిందాబాద్. బెజవాడ మధుర.


> చాకలి పద్దులు రాస్తున్న భార్య:—
> "ఏమండీ, యీవేళ తేదీ ఎంత అండీ?"
> పేపరు చదువుకొంటున్న భర్త:-
> "ఉండు; మనీ పర్సు చూసి చెప్తాను!"

సర: ఇదిగో, పార్వతమ్మగారూ, వాళ్లు మనకోసం నిల్చుండిపోయారు. అంచేత మనం ఇలా దెబ్బలాడుకుంటూ కూచోడం బాగులేదు......అందుచేత నన్ను తీసుకోనివ్వండి!

పార్వ: అదే నేనూ అంటున్నానండీ! -

గుంప: అదేటమ్మా! - అంతా నేను ముందంటే నేను ముందని కయ్యాలాడుకుంటూ కూకుంటే ఎప్పటికి తెగుతాది!

సుశీ: గంటన్నరాయ ఈ దెబ్బలాట అవుతోంది గుంపమ్మా! - అందరు ముందుగా పోవాలని దెబ్బలాడుకుంటున్నారు. ఎప్పటికీ తెగకుండా వుంది. ఎవర్ని వెనక్కుండమంటే వాళ్లే ఒప్పరు...

గుంప: ఏటి, గంటాయ కయ్యాలాడతన్నారా? ... అయితే తెగండమ్మా - తర్వాత కయ్యాలాడుకుందురుగాని నేను నీళ్ళుతీసుకుపోతాను మొదట. (వెళ్లి బిందె పట్టి మరవిప్పుతుంది)

సర: (కోపంతో) అయితే అదేవిటే తోసుకొని మీదకొచ్చేస్తావేవిటి? - ఉండు ముందు నన్ను పట్టుకుపోనీ!

గుంప: గంటాయ ఏటి సేస్తున్నారమ్మా!

సుశీ: నేను ముందంటే నేను ముందని దెబ్బలాడుకుంటున్నారు.

గుంప: అందుకే నేను మొదట ఎల్లిపోతాను. తర్వాత ఎ. సేసుకుంటే సేసుకోనీయండి! ...ఒగ్గండమ్మా మర! - అలా పట్టుకుంటారేం?

పార్వ: అయితే నువ్వీ ఎనిమిది బిందెలు పట్టుకొ సేదాకా మమ్మల్ని నిల్చోమంటావుటే?

గుంప: నిల్చోమనలేదమ్మా కయ్యాలాడుకుంటూవుండండి!...

లక్ష్మ: ఏం పొగరే? - అందరికంటే వెనకనొచ్చి? మేం ఒదలం! - ఒదలకండీ ఏం చేస్తుందో చూదాం!

గుంప : వెనకనో స్తే మాత్రం మీరు కయ్యాలాడుకుంటూ కూకుంటే ఎంతసేపు నిలుసుంటావమ్మా?... ఊఁ! ... (కోపంగా) ఒగ్గండి మర! (అందరినీ దూరంగా త్రోసి మర విప్పుతుంది.)

సర : మోటమనుషులతో మాటలేమిటి?- ఓ పిసరేనా మర్యాద తెలిసి ఏడిస్తేగా?- ఆ జాతే అంత!

పార్వ : వాళ్ళతో మరి మాటలేమిటి?- ఇంట్లో వున్న పశువులెంతో అంతే వీళ్లూను.

గుంప : ఏవండో! - ఆలోచించుకొని మాటాడండి!... పశువులు, గిశువులు అంటే ఒప్పేదిలేదు.

పార్వ : ఏమిటే ఒప్పక పోవడం?-

రావ : పోనీ ఊరుకుందురూ పార్వతమ్మగారూ! (గుంపమ్మతో) శాంతించవే తల్లీ!

(రెండునిముషా లెవ్వరూ మాటాడరు. గుంపమ్మ మొదటి బిందె నీటితో నిండిపోగానే రెండో బిందె పట్టబోతుంది)

సుశీల : గుంపమ్మా!-ఇదిగో మాతల్లి!- మొదట నేనీ బిందెపట్టుకుంటాను. గంటన్నరాయవచ్చి వీలులేక నిల్చుండి పోయాను.

గుంప : అయ్యో! పట్టుకోండి తల్లీ! (బిందె తీస్తుంది. సుశీల బిందెపట్టినీరుపట్టుకుపోతుంది)

(నిశ్శబ్దంగా పావుగంట గడుస్తుంది. గుంపమ్మ నీరుపట్టుకుంటూ వుంటుంది. ఇంతలో సరస్వతమ్మకొడుకు వస్తాడు)

సర-కొ : అమ్మా! - పొయ్యి మీద అన్నం అంతా మాడి బొగ్గయిపోయింది.

(పార్వతమ్మ కూతురు వస్తుంది.)

పార్వ. కూ : అమ్మా అమ్మా!-మనింతో నేమోనీ ర,పిల్లి దూరి పాలూ?...తాగేసిందే!

పార్వ : (కోపంతో) సరి అయిందీ?- నేననుకుంటూనే వున్నాను.

ఒక గొంతుక:ఏమే నరసమ్మతల్లీ!-ఇంకా కాలేదా నీళ్లుపట్టుకోడం? చంటిది ఏడ్చేడ్చి ఉయ్యాల్లోంచీ పడిపోయింది...ఈపాటికేనా వేగం తెములు!

లక్ష్మమ్మకొడుకు: అమ్మా. నాన్నగారికి ఆఫీసు వేళయిపోయిందట. తిడుతున్నారు.

లక్ష్మ : అప్పుడే వచ్చిందీ ప్రళయం?- పొద్దుట్నించీ శివజాగరం అవుతోంది కాని ...అయినా ఇక్కడ వున్నలాటి కుచ్చితపు బుద్ధిమనుషులు మరెక్కడా వుండరమ్మా!- (కోపంగా గుంపమ్మతో) ఏం గుంపమ్మా, అయిందా నీ నీళ్లు పట్టుకోడం?

గుంప : ఇదిగోనమ్మా! - అయిపోవస్తుంది. లేచిపోతాను.

నర : (కొళాయివంక చూస్తూ)అదేవిటే, నీటిధార అంత సన్నంగా పడుతోందేం?

గుంప : అవతల కొళాయికట్టేస్తుంటే మరేలా పడతారమ్మా?

రావ : ఇన్ని నీళ్ళుపట్టుకుపోదామని పొద్దుటనగా వస్తే దిక్కుమాలిన పోరు ఒచ్చిపడింది...(కోపంగా) ఇదేం పూరో కాని ఇలాటి వాళ్ళనేం చేసినాపాపం లేదు. (ఖాళీ బిందె చంకన పెట్టుకొని అందరివంకా కోపంగా చూస్తూ వెళ్ళిపోతుంది వెంట మిగిలిన అమ్మలక్కలు కూడా ఖాళీ బిందెల్తో బయలుదేరుతారు.)

గుంప : (వ్యంగ్యంగా) ఏవమ్మోవ్, ఇంతసేపు నిల్చోని ఇప్పుడెలిపోతారేం?- నాను తీసుకోటం అయింది! మీరు పట్టుకోండమ్మా!

లక్ష్మ : (కోపంగా) కొళాయి కట్టేస్తే మరేం పట్టుకోవడం - పిలకలు?

నర : పిలకలు పట్టుకోవడం మొదటయిందిగా? - అంచేతే నీళ్ళుపట్టుకోవడం కాలేదు.

గుంప : (వెనకనుంచీవస్తూ) పోనీ ఏవో ఒకటి పట్టుకోటం అయిందిగాదటమ్మా?- మరెందుకు విచారం? - (నవ్వుకుంటూ వెళిపోతుంది. లక్ష్మమ్మ, నరసమ్మ వెళిపోతూండగా తెరపడుతుంది.) ★

